www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 27 | మే | 2026 పేజీలు : 8

## వరద విపత్తులు ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ




-ప్రాణ, ఆస్తి నష్ట నివారణే ప్రధాన లక్ష్యం
-అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
-వరద విపత్తుల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

3లో..

# వ్యర్థాల కాల్చివేత అనర్థం..!








-కలియ దున్నితే భూమికి సారం
-కాల్చివేతలతో ప్రమాదాలు..
ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం

**పంట వ్యర్థాలను కాల్చితే అనర్థం తప్ప మరొకటి లేదు.** అధికారులు, శాస్త్రవేత్తలు పదే పదే హెచ్చరిస్తున్నా పంట వ్యర్థాలను రైతులు దహనం చేస్తూనే ఉన్నారు. ఖమ్మం జిల్లాలో పంట వ్యర్థాల దహనం కోట్ల రూపాయల ఆస్తి నష్టానికి దారి తీసింది. పంట పొలాల్లో ఉన్న మొక్కజొన్న, వరి వ్యర్థాలకు నిప్పంటించడంతో మంటలు వ్యాపించి ఉద్యానవన తోటలకు అంటుకుని దగ్ధమవుతున్నాయి. సమీపంలో ఉన్న పంట చేలు కూడా దెబ్బతింటున్నాయి.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో



# కనుమరుగవుతున్న పల్లె సంస్కృతి..!

-పిల్లల బాల్యాన్ని ఆవరించిన డిజిటల్ వినోదం, సెల్ ఫోన్, టీవీ
-వాడవాడకు పాకిన మద్యం..
బతుకులు ఛిద్రం

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** భారతీయ సంస్కృతికి మూలం పల్లె. పల్లె అంటే కేవలం ఇళ్లు, పొలాలు కాదు, అది జీవన విధానం, పరస్పర నమ్మకం, సామూహిక ఆనందం. కానీ నేటి పరిస్థితులు చూస్తే పల్లె ఆత్మ మసకబారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు పిల్లల నవ్వులతో మారుమోగిన గ్రామ వీధులు ఇప్పుడు సెల్ ఫోన్ స్క్రీన్ల కాంతితో

మిగతా 2లో..

## కార్పోరేషన్ ఆదాయానికి భారీ గండి




-చక్రం తిప్పుతున్న లైసెన్డ్స్ ఇంజనీర్
-యథాశక్తి సహకరిస్తున్న కార్పోరేషన్ అధికారులు
-విచారణ జరిపితే పలు అక్రమాలు వెలుగులోకి..

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో పైరవీల జోరుకు బ్రేకులు లేకుండాపోతున్నాయి. ఖమ్మం కార్పోరేషన్‌లోని కొందరు అధికారులు లంచానికి అలవాటుపడి పైరవీకారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు కార్పోరేషన్ కార్యాలయాన్ని తమ సొంత కార్యాలయంగా మార్చుకుని ఇష్టానుసారంగా అనుమతులు పొందుతున్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఒక లైసెన్డ్స్ ఇంజనీర్ పెద్ద ఎత్తున చక్రం తిప్పుతున్నాడు. భూ, భవన యజమానుల నుండి పెద్ద మొత్తంలో పుచ్చుకుని కార్పోరేషన్‌కు చెల్లించే పన్నుకు మినహాయింపు ఇచ్చేవిధంగా అనుమతులు తీసుకువస్తున్నారు. భవనం నిర్మించే స్థలానికి అనుమతులు పొందే స్థల విస్తీర్ణానికి సంబంధం ఉండడం లేదని పేపర్లపై ఉన్న అనుమతులకు

మిగతా 2లో..

# వ్యర్థాల కాల్చివేత అనర్థం..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పంట వ్యర్థాలను కాల్చితే అనర్థం తప్ప మరొకటి లేదు. అధికారులు, శాస్త్రవేత్తలు పదే పదే హెచ్చరిస్తున్నా పంట వ్యర్థాలను రైతులు దహనం చేస్తూనే ఉన్నారు. ఖమ్మం జిల్లాలో పంట వ్యర్థాల దహనం కోట్ల రూపాయల ఆస్తి నష్టానికి దారి తీసింది. పంట పొలాల్లో ఉన్న మొక్కజొన్న, వరి వ్యర్థాలకు నిప్పంటించడంతో మంటలు వ్యాపించి ఉద్యానవన తోటలకు అంటుకుని దగ్ధమవుతున్నాయి. సమీపంలో ఉన్న పంట చేలు కూడా దెబ్బతింటున్నాయి. ఖమ్మం జిల్లాలో సుబాబుల్, జామాయిల్, పామాయిల్ తదితర పంటలకు నిప్పంటుకోవడం ద్వారా రైతాంగం కోట్ల రూపాయల మేర నష్టపోయారు. వ్యర్థాలను కాల్చడం అనర్థం. వ్యర్థాలను కాల్చడం ద్వారా భూమి వేడెక్కి భూసారాన్నికోల్పోతుంది. ఇప్పటికే రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడటం వల్ల భూమి నిస్సారం అవుతున్న దశలో భూమి వేడెక్కితే మరింత అనర్థం కలుగుతుంది. భూసారం తగ్గడంతో పాటు రైతుమిత్రులుగా ఉన్న అనేక రకాల క్రిమి కీటకాలు మరణించడంతో పంటలకు నష్టం వాటిల్లుతుంది. వ్యర్థాలను కలియ దున్ని సూపర్ ఫాస్ఫేట్ వాడకం లేదా ఇతర రసాయనాలను స్ప్రే చేయడం ద్వారా వ్యర్థాలు భూమిలో కుళ్లిపోయి భూమి సారవంతం అవుతుంది. భవిష్యత్తులో పంటలు ఏపుగా ఎదిగి అధిక ఉత్పత్తి సాధించేందుకు కారణం కావడంతో పాటు రసాయనిక ఎరువుల వాడకం కూడా అంతగా వాడాల్సిన అవసరం ఉండదు. ఈ విషయాన్ని రైతులు గ్రహించక తమ వ్యర్థాలను కాల్చుతూ తాము నష్టపోతూ రైతులను నష్టపరుస్తు



న్నారు. ఖమ్మం జిల్లాలో పంట వ్యర్థాలకు నిప్పంటించడంతో కిలో మీటర్ల మేర మంటలు వ్యాపించి భారీ అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పలు ప్రాంతాల్లో జామాయిల్, సుబాబుల్, పామాయిల్ కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల మామిడి చెట్లకు కూడా నిప్పంటుకుని రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఉద్యానవన పంటలకు సంబంధించి అనేక ఏళ్ల పాటు మొక్కలను పెంచి ఫలితం అనుభవించే దశలో అగ్నికి ఆహుతి కావడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. చింతకాని మండలంలో కల్లాల్లో ధాన్యం, మొక్కజొన్నలు కాలిపోవడంతో పాటు మూగజీవాలు కూడా మరణించాయి. జూన్ మాసం సమీపిస్తున్నందున వ్యర్థాల కాల్చివేతను నిలుపుదల చేసి చినుకు పడిన వెంటనే కలియ దున్నితే భూసారం పెరిగి లాభిస్తుందన్న విషయాన్ని రైతులు గ్రహించాల్సి ఉంది.

# కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి

(మొదటి పేజీ తరువాయి)



వాస్తవ నిర్మాణానికి అసలు పొంతనే లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. భవన నిర్మాణదారులు అనుమతులు పొందేందుకు కార్పొరేషన్‌లో నిరంతరం ఉండే పైరవీకారులను ఆశ్రయించడంతో పాటు ఒక లైసెన్డ్స్ ఇంజనీర్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నా లేకున్నా ఆయన మాత్రం అనుమతులు తీసుకు వస్తారు. ఈ లైసెన్డ్స్ ఇంజనీర్ సమర్పించే సెల్ఫ్ డిక్లరేషన్‌ల లోనూ అంతా తప్పుడు సమాచారమే ఉందన్న ఆరోపణ వినవస్తుంది. ఇతనితో పాటు మరి కొందరు కూడా ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారు. చక్రం తిప్పుతున్న ఈ లైసెన్డ్స్ ఇంజనీర్ వద్దకు మిగిలిన వారు కూడా పైరవీ కోసం ఆశ్రయిస్తున్నారు. సెట్‌బ్యాక్ వదలకుండా, పార్కింగ్ కేటాయింపులు లేకుండా ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి నిర్మాణాలు జరుపుతున్న వాటికి కార్పొరేషన్ ద్వారా వెంటనే అనుమతులు వస్తుండటం వెనక కార్పొరేషన్ అధికారుల సహకారమే కారణమని తెలుస్తుంది. ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ నిజాయితీపరుడే అయినా ఇటువంటి అడ్డగోలు అనుమతులకు సంబంధించి సిబ్బందిని నియంత్రించడంలో వైఫల్యం చెందారని అంతగా పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. సహజంగా ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు విచారణకు ఆదేశించడం అనవాయితీ. మీడియా ద్వారా ఇటువంటి వార్తలు రాగానే కమిషనర్ మీడియాపై ఫైర్ అవుతున్నారు తప్ప వాస్తవాలను గుర్తెరగడం లేదని కార్పొరేషన్‌లోని కొందరు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ లైసెన్డ్స్ ఇంజనీర్ ద్వారా కార్పొరేషన్‌కు సమర్పించిన ధృవపత్రాలు, సెల్ఫ్ డిక్లరేషన్‌లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఖమ్మం నెహ్రూ నగర్‌లోని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనానికి సంబంధించి అనుమతులు ఎవరిచ్చారు, ఏ మేరకు అనుమతులు ఉన్నాయి, అనుమతులకు, నిర్మాణాలకు మధ్య ఉన్న తేడాలను కూడా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కనుమరుగవుతున్న పల్లె సంస్కృతి..!

(మొదటిపేజీ తరువాయి)

మౌనంగా మారుతున్నాయి. పల్లెటూరు ఆటలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి సామాజిక అనుబంధాలకు ప్రతీకలు. కబడ్డీ, ఖోఖో, గిల్లిదండ(గోటిబిళ్ళ), అష్టాచెమ్మ, తొక్కుడుబిళ్ళ, దాగుడుమూతలు, కోతి కొమ్మచ్చి, తొక్కుడుబిళ్ళ, ఐదు రాళ్ళ ఆట, గుజ్జన గూళ్ళు, గోలీలు, వాలీబాల్ వంటివి ముఖ్యమైన గ్రామీణ క్రీడలు. ఇవి ఎలాంటి ఖర్చు లేకుండా సహజ సిద్ధమైన పరిసరాల్లో ఆడే సాంప్రదాయ ఆటలు, కబడ్డీ, కోకో, గిల్లీదండా, వంగుడు దూకుడు వంటి సంప్రదాయ ఆటలు పిల్లల జీవితాల నుంచి నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. శారీరక దృఢత్వం, స్నేహబంధాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించిన ఆ ఆటలు ఇప్పుడు డిజిటల్ వినోదానికి బలి అవుతున్నాయి.

### జానపద గాన సంప్రదాయం కూడా క్షీణిస్తోంది..

ఒకప్పుడు పొలాల్లో వినిపించిన ఊయల పాటలు, కోతల గీతాలు, బతుకమ్మ గానాలు ఇప్పుడు అరుదుగా మాత్రమే వినిపిస్తున్నాయి. టీవీ, సినిమా పాటల ప్రభావం జానపద సంస్కృతిని వెనక్కు నెడుతోంది. ఇది కేవలం సంగీత మార్పు కాదు. మన సంస్కృతి మూలాలపై పడుతుంది. ఇక పల్లెల్లో మద్యం వ్యసనం పెరుగుదల అత్యంత ఆందోళనకరం. చిన్న వయసులోనే యువత చెడు అలవాట్లకు బానిసవుతోంది. కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోంది. ఆర్థికంగా, సామాజికంగా గ్రామాలు బలహీన పడుతున్నాయి. ప్రభుత్వాల ఆదాయ విధానాలు మద్యం విక్రయాలపై ఆధారపడటం కూడా పరోక్షంగా ఈ పరిస్థితికి దోహదం చేస్తున్నాయనే విమర్శలను విస్మరించలేం. నగరీకరణ, వలసలు గ్రామాల సామాజిక ఐక్యతను దెబ్బతీశాయి. ఒకప్పుడు గ్రామోత్సవాలు, పండుగలు ఐక్యతకు ప్రతీకలు కాగా, ఇప్పుడు ఆ ఉత్సాహం తగ్గిపోతోంది. కుటుంబాలు విడిపోవడం, పరస్పర అనుబంధాలు సడలడం గ్రామీణ జీవన విధానాన్ని బలహీనపరుస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు మౌనంగా ఉండలేవు. పాఠశాలల్లో సంప్ర



దాయ ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. జానపద కళాకారులకు ప్రోత్సాహం కల్పించాలి. మద్యం నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలి. యువతకు క్రీడా మైదానాలు, సాంస్కృతిక వేదికలు అందించాలి. పల్లె సంస్కృతి కాపాడటం అంటే గతాన్ని మహిమాపరిచడం కాదు. భవిష్యత్తును బలోపేతం చేయడం. పల్లె బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. ఇప్పటికైనా సమాజం మేల్కొనాలి. లేదంటే రేపటి తరాలు పల్లె గురించి పుస్తకాలలో చదివే పరిస్థితి రావచ్చు.

### అవసరాల రీత్యా సంబంధాలు..!

ఈ మూడు నాలుగు దశాబ్దాల తర్వాత, పల్లె ముఖచిత్రమే మారింది. ప్రపంచం కుగ్రామంగా మారి, గ్లోబలైజేషన్ ప్రభావం వల్ల పల్లె పట్టణం ఒక్క తీరే అయ్యింది. నగరంలో దొరికే అన్ని వస్తువుల సేవలు పల్లెలో దొరుకుతున్నయి. రవాణా వ్యవస్థ, విద్యా వ్యవస్థ, ఉపాధి రంగం కొత్త పుంతలు తొక్కినా, నిరుద్యోగం పెరిగింది. ముఖ్యంగా రాజకీయాలన్ని వ్యాపారమయం అయిపోయాయి. గతంలో ఉన్న సామాజిక విషయాల పట్ల అవగాహన చైతన్యం పేదల పట్ల సానుభూతి సమానత్వం పట్ల మనుషుల అవగాహన పెరిగింది. గతంలో ఒక రాజకీయ పార్టీకి ఆ సిద్ధాంతం నమ్ముకొని మాత్రమే అందులో కార్యకర్తలు చేరేవారు. కానీ ప్రస్తుత సందర్భంలో అధికార పార్టీతో అవసరాల రీత్యా సంబంధాలు కార్యాచరణ ఎక్కువ అయ్యాయి. పైన సుట్టు వైకుంఠం ఉన్నట్టు పవర్ చుట్టూ మనుషులు, యువతరం చేరుతున్నారు.

# రాత్రి సమయంలో మొక్కజొన్న అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి

**- ఇందిరా మహిళాశక్తి భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి**

**- కలెక్టర అంకిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాత్రి వేళల్లో కూడా మొక్కజొన్న అన్లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం బంగారుచెలక మొక్కజొన్న గోదామును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా 2500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులగూడెం, ఇల్లెందు, చర్ల, సమ్మెట, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గండాల తదితర మండలాల నుండి మొక్కజొన్న వస్తున్నట్లు తెలిపారు. అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో సైతం జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో నిర్మాణం అవుతున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులు పరిశీలించిన ఆయన ఏడాదికి కూడా పనులు కూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు మెమోలు జారీ చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీలేదని, ఇప్పటికైనా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శిరీష, పంచాయితీ రాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత నుండి జాగ్రత్తగా ఉండాలి

**- ఎస్‌పి రోహిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రహదారులపై విధులు నిర్వహించే సిబ్బంది, ఎండ తీవ్రత నుండి జాగ్రత్తగా ఉండాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండలో విధులు నిర్వహించే పోలీస్ శాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. తమ వెంట సమ్మర్ కిట్లు సిద్దంగా ఉంచుకోవాలని, తీవ్రతకు గురికాకుండా మంచినీటిని తరుచుగా తీసుకుంటూ ఉండాలన్నారు. రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా చూడాలని, పశువుల అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రోడ్డు భద్రతా నియమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ఆదినారాయణ, సిఐలు వెంకటేశ్వర్లు, శ్రీ లక్ష్మి , కరుణాకర్, ప్రతాప్, ఇంద్రసేనారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నూతన దేవాలయం దీవెనలకు నిలయం



**ప్రజాపక్షం/కల్లూరుః** నూతన దేవాలయాలు దీవెనలకు నిలయమని ఖమ్మం ఆర్ సీఎం బిషప్ సగిలి ప్రకాష్ అన్నారు. కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన బోధించారు. క్రైస్తవులు బైబిల్ వాక్యార్చన చేసుకోవాలని దీని ద్వారా దేవుని యొక్క ఆశీర్వాదాలు పొందుతారని, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా బలపడి దేవునికి దగ్గరగా జీవిస్తూ ఉంటారని సమాజంలో అందరూ సమానమేనని, ఒకరు నొకరు ప్రేమ, సౌభ్రాతృత్వంతో జీవిస్తూ ఉండాలని ఈ సమాజం లో ఐక్యతతో ఉంటూ, క్రీస్తు భగవంతుని ఆదర్శంగా తీసుకొని జీవిస్తూ ఉండాలని క్రైస్తవులను కోరారు. క్రైస్తవ సమాజం ఇతరులకు ఆదర్శవంతంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతీ యువకులు క్రైస్తవులు చర్చిలో ప్రార్థనలలో పాల్గొనడం ద్వారా విజ్ఞానం పెరుగుతూ క్రమశిక్షణతో మెలకువలతో సమాజానికి ఆదర్శవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు వినయ్ కుమార్ రెడ్డి స్టీఫెన్, జేసురాజు, నరేష్, సురేష్ , ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మత గురువులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, సర్పంచ్ శ్రీనివాసరావు, బిఆర్‌ఎస్ నాయకుల తో పాటు కాంగ్రెస్ మాజీ సర్పంచ్ శిరసాని జమలయ్య, ప్రస్తుత ఉప సర్పంచ్ నలజాల కిషోర్, తోపాటు కన స్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు సంఘస్తులు, యువతీ యువకులు,మరియ దళ సభ్యులు, సంఘస్తులు తోపాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# వరద విపత్తులు ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ

-ప్రాణ, ఆస్తి నష్ట నివారణే ప్రధాన లక్ష్యం
-అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
-వరద విపత్తుల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు అప్రమత్తంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధతే ప్రాణ నష్టాన్ని తగ్గించే మార్గమని పేర్కొన్నారు. వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులను సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చునని తెలిపారు. వరదల సమయంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ముఖ్య బాధ్యత అన్నారు. మానవ ప్రాణాలు, పశువుల ప్రాణ నష్టం జరగకుండా చూడటం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించరు. కలెక్టరేట్‌లో 24 గంటలు కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు కీలకంగా పనిచేయాలన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్‌ను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వరదల సమయంలో అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ముంపుకు గురయ్యే గ్రామాలు, ప్రభుత్వ సంస్థలు, సంబంధాలు తెగిపోయే గ్రామాల జాబితా, కూలిపోయే, ప్రమాదంలో ఉన్న ఇండ్ల వివరాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. ఎన్ని కుటుంబాలు తరలించాలి, ఎన్ని పునరావాస కేంద్రాలు అవసరం అవుతాయో, సౌకర్యాలు ఏమిటో అన్న వివరాలతో ముందస్తు నివేదికలు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి మండలంలో ఎంపిడివో, ఎంఈవో, ఎంపివో, తహసీల్దార్, పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖాధికారులు సభ్యులుగా మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, క్రాస్ రోడ్డులు, లోతట్టు రహదారుల వద్ద వరదల సమయంలో పూర్తిగా మూసివేయాలని, ప్రజలు దాటకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వరదల అనంతరం వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాల ఆధారంగా ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈత తెలిసిన వ్యక్తుల జాబితాను ప్రతి మండలంలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాగులు, చెరువులు, ఎగువ జిల్లాల నీటి మట్టాలు, ట్రిగ్గర్ పాయింట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరదల అనంతరం వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందని ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పి సిఈవో దీక్షారైనా, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

-ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహా
-ఘనంగా రెండవ ఏఎన్ఎంల జిల్లా మహాసభ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో రెండవ ఏఎన్ఎం యూనియన్ (ఏఐటియుసి) ఖమ్మంజిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షులు తమ్మారపు జయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలు వ్రాత పరీక్ష రాసి రెండేళ్లు దాటినా ప్రభుత్వం పోస్టులు నింపడంలో నత్తను తలపిస్తుందని విమర్శించారు. తక్షణమే పోస్టుల సంఖ్యను పెంచి ఎంపిహెచ్‌వి (ఫ్) భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం పని చేసే ఏఎన్‌ఎంలకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రభుత్వానికి వైద్య రంగంలో పునాదిగా ఉన్నటువంటి రెండవ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్‌ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వ్రాత పరీక్షలో ఉద్యోగం రాకుండా మిగిలిన పోయిన వారికి 100 శాతం గ్రాస్ శాలరీ, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భవిష్యత్ పోరాటాలకు రెండవ ఏఎన్ఎంలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం (ఏఐటియుసి) రాష్ట్ర నాయకురాళ్లు సుమతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అల్పాహారం పథకాన్ని హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకొని, సెంట్రల్ లైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన సంఘం నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 5, 6 తేదీలలో హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత నాలుగు రోజుల క్రితమే ఖమ్మం జిల్లా మధిర నియోజవర్గ కేంద్రంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు భట్టి విక్రమార్క హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ కి స్థలం అప్పజెప్పే ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మధిర కేంద్రం నుంచే జిల్లా నలుమూలలకు అల్పాహారం, భోజనం అందిస్తామని చెప్పటం మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొట్టటమేనని, గత 25 సంవత్సరాలుగా వివిధ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఎప్పటికప్పుడు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని, వంట కార్మికులకే అల్పాహార పథకాన్ని అమలు చేస్తే తప్ప పోషకాలతో కూడిన అల్పాహారం అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి కార్మికుల ద్వారానే మధ్యాహ్నం భోజనం అల్పాహారం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజనం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహీమున్నీసా, జిల్లా సమితి సభ్యులు మహాదేవ లక్ష్మి, పూచి సీత, జక్కంపూడి వెంకటలక్ష్మి, పారేపల్లి సత్యవతి, కారం నాగలక్ష్మి, చామకూర సత్యవతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జరీనా, మంగమ్మ, సీతమ్మ, కృష్ణవేణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌ను కలిసిన వెలుగుమట్ల బాధితులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూ దాన్ భూముల్లో ఇండ్లను కోల్పోయిన బాధితులు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. మంగళవారం డా॥ విశారదన్ మహారాజ్, కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో వెలుగుమట్ల బాధితులు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి వెలుగుమట్ల అంశాన్ని వివరించారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో నివసిస్తున్న పేదల ఇండ్లను కూల్చివేసి అక్కడ 311 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చారని మిగిలిన 500 మందికి ఇండ్ల పట్టాలు, ఇండ్లు మంజూరు చేయలేదని గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ బాధితులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జస్టిస్ చంద్రకుమార్, బాధితులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గతంలో కలిసి తమ బాధను చెప్పుకున్నారు. మంత్రి తక్షణమే అందరికీ ఇండ్ల స్థలంతో పాటు ఇండ్లు నిర్మిస్తామని మాట ఇచ్చారని కానీ ఇంత వరకు ఏమి చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ గవర్నర్‌పై మాకు పూర్తి నమ్మకం ఉందని బాధితులకు న్యాయం చేస్తారని తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్‌సిఎస్టి జేఏసి రాష్ట్ర అధ్యక్షులు తోట ముదిరాజ్, రాఘవేంద్ర, రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు, భూదాన్ బాధితుల కమిటీ కన్వీనర్ కెవి కృష్ణారావు, వట్టె ఉదయ్ కిరణ్, మట్టా నవ్య, సోమా ఉమారాణి, హమీద్ పాషా, శివరాత్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చింతకానిలో వీఓఏల భిక్షాటన



**ప్రజాపక్షం/చింతకాని :** వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ కల్పించాలని కోరుతూ చింతకాని మండల వీఓఏలు మంగళవారం భిక్షాటన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వీఓఏల సమ్మెకు మండల బిఆర్ఎస్ పార్టీ సంఘీభావం పేర్కొంది. పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు మాట్లాడుతూ గత 25 ఏండ్లుగా డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న వీఓఏలు కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీఓఏల పాత్ర తప్పనిసరిగా ఉందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, తాతా ప్రసాద్, పిన్నెల్లి శ్రీను, వీఓఏలు అరుణ, ధనలక్ష్మి , నాగరాణి, సైదులు, రాజు, నాగేశ్వరి, పుష్ప, రిజ్వానా, నాగమణి, హైమారావు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి



**ప్రజాపక్షం/చింతకాని :** బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే వివాహం చేయాలని, చిన్న వయస్సులో బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాశిమాల వెంకమ్మ , మహిళలు పాల్గొన్నారు.

# నిధి ఆప్కే నికట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఖమ్మం లలితా జ్యూయలరీ వద్ద నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవలపై అవగాహన, కొత్తగా కవరైనా సంస్థల యజమానులకు పరిచయం, ఆన్‌లైన్ సేవల వివరాలు, పెన్షనర్లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గారి యోజనపై అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇంట్లోనే వ్యాపారి మృతి

-రెండు రోజుల తర్వాత గుర్తింపు



**ప్రజాపక్షం/తల్లాడ :** ఇంట్లో వ్యాపారి మృతి చెందగా రెండు రోజుల తర్వాత గుర్తించిన ఘటన ఖమ్మం జిల్లా తల్లాడలో చోటు చేసుకుంది. తల్లాడకు చెందిన బండారు మోహన్‌రావు (65) మిర్చి వ్యాపారం నిర్వహిస్తుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో మంచి వ్యాపారిగా గుర్తింపు పొందారు. పిల్లలిద్దరికి వివాహం కావడంతో భార్యాభర్తలు తల్లాడలో నివసిస్తున్నారు. భార్య నాగమణి భద్రాచలంలోని కుమార్తె వద్దకు 10 రోజుల క్రితం వెళ్లింది. అప్పటి నుంచి మోహన్‌రావు ఒక్కరే ఒంటరిగా ఉంటున్నారు. శనివారం బాగా ఎండలో తిరిగి ఇంటికి చేరుకున్న మోహన్‌రావు ఇక బయటకు రాలేదు. చుట్టు పక్కల వారు కుమార్తె వద్దకు వెళ్లి ఉంటాడని భావించారు. కానీ సోమవారం సాయంత్రం నుంచి ఇంట్లో నుంచి దుర్గంధం వస్తుండడంతో సమీపంలో నివసిస్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా మోహన్‌రావు మృతి చెంది ఉన్నారు. కుటుంబ సభ్యులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

## బాల్య వివాహాల నివారణపై అవగాహన



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీలో షీ టీం, ఏహెచ్‌టీయూ, భరోసా ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు బాల్య వివాహ నిరోధక చట్టం గురించి ప్రజలకు వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అలాగే చదువుతో కలిగే ప్రయోజనాలు, బాలికలు ఉన్నత విద్య అభ్యసించి స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరాన్ని వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712682131 మరియు చైల్డ్ లైన్ 1098 నంబర్లను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## వడదెబ్బకు రేషన్ డీలర్ మృతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వడదెబ్బ కారణంగా జూలూరుపాడు మండలపరిధిలోని బచ్చల కోయగూడెం గ్రామ నివాసి, పాపకొల్లు గ్రామ రేషన్ డీలర్ జబ్బా రామనాధం (55) సుధాకర్ మృతి చెందాడు. మంగళవారం బంధువులు తెలిపిన సమాచారం ప్రకారం.. మే 23వ తేదీన రామనాధం వడదెబ్బకు గురయ్యాడని. సోమవారం కొత్తగూడెంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందారన్నారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వరంగల్ నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం జబ్బా రామనాధం మృతి చెందినట్లు బంధువులు వెల్లడించారు. వడదెబ్బతో రామనాధం మృతి చెందినట్లు భార్య అనసూర్య జూలూరుపాడు పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రామనాధం మృత దేహాన్ని కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఎండల పట్ల అత్యంత అప్రమత్తంగాఉండాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** భానుడి భగభగలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పలు సూచనలు, సలహాలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరూ ఎండల పట్ల అత్యంత అప్రమత్తంగాఉండాలని, ఉపాధి హామీ పనులను ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయమే ముగించుకోవాలని, దాహం వేయకపోయినా సరే నిరంతరం, మంచినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ ద్వారా ద్రావణం ఎక్కువగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామ దీపికల సమ్మెకు పలువురు సంఘీభావం



**ప్రజాపక్షం/ఏన్కూరు :** గ్రామ దీపికల సమ్మెకు పలు పార్టీల నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ దీపికలకు ఏఐటీయూసీ, బిఆర్ఎస్, సిఐటియు నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. 420 హామీలతో అన్ని వర్గాల ప్రజల్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసగిస్తుందని ఆరోపించారు. ప్రజలు సరైన సమయంలో మోసపూరిత ప్రభుత్వానికి గుణపాఠం చెప్తారని అన్నారు. ఈకార్యక్రమంలో వైరా బిఆర్ఎస్ నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జ్ ఆర్‌జెసి కృష్ణ, వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి, నాయకులు లాకావత్ గిరిబాబు, బాదావత్ బాలాజీ, కట్టా కృష్ణార్జునరావు, కిలారు కిరణ్, వనమా విశ్వేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, మండల నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, రైలు, మల్లెంపాటి మాధవరావు, చీటి కోటేశ్వరరావు, ముదిగొండ నాగేశ్వరరావు, చీటీ ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దీపికలు నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శన



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఐకెపి గ్రామ దీపికలు మంగళవారం ఉదయం నల్ల బ్యాడ్జీలు కండ్లకు కట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని, జీవో నెంబర్ 58ని సవరించాలని, సీసీలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ట్యాబ్ సౌకర్యం కల్పించాలని, సాధారణ, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సమ్మెలో ఏఐటీయూసి నాయకులు మంకెన కృష్ణ పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో సంఘ జెఏసీ నాయకులు జంపాల నరేష్ పాల్గొన్నారు.

## కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరం

- నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- వీధి కుక్కల నివారణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి
- ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరమని, బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చేతకొండ ఎస్సీ కాలనీ చాటివారిగూడెంకు చెందిన మారె రాములమ్మ అనే మహిళ కుక్కకాటితో మృతి చెందగా ఆమె మృతదేహాన్ని మంగళవారం పాషా సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల సంచారం పెద్ద ఎత్తున ఉందని, కుక్కకాటు వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాములమ్మ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి సానుభూతి తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని,బాధిత కుటుంబానికి అండగా నిలవాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. నివాళ్లర్పించిన వారిలో జ్యోతి బసు, పిచ్చయ్య, మిరియాల రాము, లక్ష్మయ్య, జాన్సన్, క్రాంతి, రాజేష్ కళ్యాణ్, జ్ఞానముత్యం తదితరులున్నారు.

# చీకటిలోనే బతుకులు..!

-విద్యుత్ కోసం ఏడాదిగా ఎదురు చేస్తున్న పేద కుటుంబం
-ఇంటి నెంబర్ లేక వృద్ధురాలి కుటుంబం దయనీయ స్థితి
-పాములు, తేళ్ల మధ్య జీవనం
-అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
-మూడేళ్లుగా పింఛన్ లేక, దయనీయ స్థితిలో అనసూయ కుటుంబం



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రభుత్వ పథకాలు పేదల గడప తట్టాలనే నినాదాలు వినిపిస్తున్నా కూసుమంచిలో ఓ నిరుపేద కుటుంబం మాత్రం ఏడాదిగా చీకటిలోనే బతుకును నెట్టుకొస్తోంది. ఇంటికి నెంబర్ లేక విద్యుత్ కనెక్షన్ రాక, గత మూడు సంవత్సరాలుగా పింఛనఖ కూడా మంజూరు కాక వృద్ధురాలు గద్దం అనసూయ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గ్రామ పంచాయితీ పరిధిలో చిన్న ఇంట్లో నివసిస్తున్న అనసూయ తన కుమారుడు, మనవడితో కలిసి విద్యుత్ లేకుండానే జీవిస్తోంది. రాత్రి పడితే ఇంటంతా కమ్ముకునే చీకటి, బయట పాములు, తేళ్ల సంచారం, భయంతోనే ప్రతి రోజు గడుస్తోందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మొబైల్ టార్చ్‌లు, కొవ్వొత్తుల వెలుగే వారికి ఆధారం అయ్యాయి. ఇంటి నెంబర్ మంజూరు చేయాలని పలుమార్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి నీరజను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంటి నెంబర్ లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు కూడా కనెక్షన్ ఇవ్వలేమని చెప్పడంతో వారి సమస్య మరింత క్లిష్టంగా మారింది. అంతే కాదు. గత మూడు సంవత్సరాలుగా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు మంజూరు కాలేదని అనసూయ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు వృద్ధాప్యం, మరో వైపు ఆర్థిక ఇబ్బందులు, కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో కుటుంబం దయనీయ స్థితిలో ఉంది. గ్రామస్తులు మాత్రం అధికారుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార అవసరాలకు విద్యుత్ కనెక్షన్లు వేగంగా మంజూరు అవుతున్నా, ఓ పేద కుటుంబం సమస్య మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామానికి వచ్చిన ప్రతిసారి సమస్యను వివరించినా పరిష్కారం కాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గద్దం అనసూయ కుటుంబానికి ఇంటి నుంబర్, విద్యుత్ సౌకర్యం, పెండింగ్ పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఈవిషయంపై పంచాయితీ కార్యదర్శి నీజర వివరణ....**

ఇంటి నెంబర్ విషయంలో గతంలో కొంత వివాదం ఉన్నదని పంచాయితీ కార్యదర్శి నీరజ ప్రజాపక్షంకు తెలిపారు. ప్రస్తుతం అనాథరైజ్డ్ జాబితాలో పంపించే ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. అలాగే పింఛన్ మంజూరుకు కూడా కృషి చేస్తామని చెప్పారు.

## తీవ్ర ఎండల నుండి సింగరేణి కార్మికులను రక్షించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రస్తుతం వీస్తున్న తీవ్రమైన, వడగాల్పుల, ఎండల నేపథ్యంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ (ఓసి) గనులు మరియు వివిధ ఉపరితల విభాగాలలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యం, భద్రతను కాపాడటానికి తక్షణమే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరుతూ గుర్తింపు కార్మికసంఘము ఏఐటియుసి ఆధ్వర్యంలో మణుగూరు లోని పీకెఓసి2, ఓసి4, ఎంఎన్‌జి ఓసి, కెసిహెచ్‌పి లలో ఉన్నతాధికారులకు మెమోరాండం పత్రాన్ని అంద.ఏయడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ వై. రాంగోపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కార్మికుల పని తీరుపై, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున యాజమాన్యం వెంటనే రక్షణ చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన తీవ్రమైన ఎండల హెచ్చరికల (రెడ్ అలర్ట్) ను తీవ్రమైన ఎండల భారీ నుండి రక్షణ కల్పించడానికి కార్మికులకు మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు విశ్రాంతి సమయంగా ప్రకటించాలని, తీవ్ర వేసవి దృష్ట్యా పికెఓసి2 లో బ్లాస్టింగ్ 12:00 కల్లా పూర్తి చేయాలని, కార్మికులకు అన్ని పని ప్రదేశాలలో తగినంత చలువ పందిళ్ళు, తాగునీరు, చల్లని నీటి వసతి మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు తగిన విశ్రాంతి సమయాలు ఇవ్వాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ రూములలో కాంపౌండర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ దెబ్బ తగలకుండా అవసరమైన చోట్ల షెడ్లు, విశ్రాంతి గదులు మరియు ఇతర రక్షణ సౌకర్యాలు కల్పించాలి అన్నారు. తక్షణమే దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి గుర్తింపు సంఘం జనరల్ సెక్రటరీ కె. రాజ్ కుమార్ఇప్పటికే ఈ వడగాల్పుల ముందస్తు జాగ్రత్తలు మరియు విశ్రాంతి వేళల విషయమై గౌరవ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) మరియు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. కావున కార్మికుల ఆరోగ్యం మరియు భద్రత దృష్ట్యా మణుగూరు ఏరియాలోని అన్ని ఓపెన్ కాస్ట్ గనులు, ఉపరితల విభాగాలలో ఈ రక్షణ చర్యలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసాశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కామ్రేడ్ జి పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, బి సురేందర్ రావు పిట్ సెక్రటరీలు ఎస్ కుమారస్వామి, జి శ్రీనివాసరావు, ఈసం శ్రీనివాస్, సాయి ప్రకాష్ చారి, గౌస్ పాషా ఉడుత శివకుమార్, సందీప్, సుధీప్త్, జానకి ప్రసాద్, బత్తుల కృష్ణ, ఉస్మాన్, సురేష్, నరహరి, అజీజ్, బొక్క శ్రీను, కళ్యాణం రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిప్పు..భూసారానికి ముప్పు..!

-అవగాహన లేక వరి కొయ్యలను కాలుస్తున్న రైతన్నలు
-పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండల వ్యాప్తంగా నిప్పు..భూసారానికి ముప్పుగా మారుతోంది. యాసంగి వరి కోతలు పూర్తి కావడంతో వానకాలం సాగు పనులను రైతులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అవగాహన లేకపోవడంతో వరి కొయ్యలను రైతులు నిప్పు పెడుతున్నారు. తక్కువ సమయంలో భూమిని తదుపరి సాగుకు సిద్ధం చేయాలనే ఉద్దేశంతో రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నప్పటికీ, దీని ప్రభావం పర్యావరణం, ప్రజారోగ్యం, భూసారంపై తీవ్రంగా పడుతోందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటల కోతల అనంతరం మిగిలిపోయిన గడ్డి, అవశేషాలను కాల్చడం వల్ల గాలిలోకి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతోంది. పంట అవశేషాల దహనం వల్ల కార్బన్మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, ఇతర విష వాయువులు వాతావరణంలోకి చేరి శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, శ్వాస కోస సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా మంటలు, అలర్జీలు, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. అవశేషాలను కాల్చడం వల్ల భూమిలో ఉండే సూక్ష్మ జీవులు నశించి నేల సహజ సారం తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో పంట దిగుబడులు తగ్గడంతో పాటు రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. భూమి ఆరోగ్యం దెబ్బతినడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతపై కూడా దీర్ఘకాలిక ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కొరత, అవేషాల తొలగింపుకు అధిక ఖర్చు, తక్కువ సమయంలో తదుపరి పంట సాగు చేపట్టాల్సిన అవసరం వంటి కారణాలతో రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పంట అవశేషాలను కాల్చకుండా కంపోస్ట్ తయారీ, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి, పశువుల మేత, బయోగ్యాస్ తయారీకి వినియోగించడం ద్వారా రైతులకు అదనపు ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం తీసుకునే జాగ్రత్తలే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యమైన వాతావరణాన్ని అందించగలవని లేదంటే నేటి సౌలభ్యం రేపటి తరాలకు పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**వరి కొయ్యలను తగల పెట్టకూడదు...ఏవో వెంకటేశ్వర్లు**



రైతులు పంట కోసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను తగలపెట్టకూడదు ఇలా చేస్తే భూసాకం దెబ్బతినే ప్రమాదం ఉందని పినపాక ఏవో వెంకటేశ్వర్లు అన్నారు. ఈవిషయంపై ఇప్పటికే గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించామని, జీలుగు, పిల్లి పెసర వంటివి సాగు చేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుందన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలి

-9 మండలాల స్థాయి క్రికెట్ పోటీల ముగింపు వేడుకలో ఆర్‌జేసీ కృష్ణ



**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలని బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌చార్జ్ ఆర్‌జెసి కృష్ణ అన్నారు. మాజీ ఎంఎల్ఏ బానోత్ మదన్ లాల్ జ్ఞాపకార్థం ఏన్కూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9 మండలాల స్థాయి క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రతి ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని యువతకు సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో ఏన్కూరు జట్టు ప్రథమ స్థానం, కొణిజర్ల జట్టు ద్వితీయ స్థానం, పూసలపాడు జట్టు తృతీయ స్థానం, అంజి 11 జట్టు నాలుగో స్థానం సాధించాయి. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, షీల్డ్‌లు అందజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బానోత్ మనీషా లక్ష్మి, లాకావత్ గిరిబాబు, బాదావత్ బాలాజీ, కట్టా కృష్ణార్జున్, కిలారు కిరణ్, వనమా విశ్వేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, మండల నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎండ్రాతి మోహన్‌రావు, చీటీ కోటేశ్వరరావు, ముదిగొండ నాగేశ్వరరావు, చీటీ ముత్తయ్య, జారా సాంబయ్య, కడియాల బాబు, భూనోత్ వెంకన్న, షేక్ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

## నిప్ప పెడితే కాలుష్యం.. కలియదున్నితే ప్రయోజనం..!

**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు పంట అవశేషాలను కాల్చివేస్తున్నారు. పంట వ్యర్థాలను , వరి కొయ్యలను తగలబెడితే వచ్చే పొగతో వాతావరణం కాలుష్యం పెరుగుతోంది. మట్టిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది.

**సేంద్రియ ఎరువుగా..**

పంట వ్యర్థాలను భూమిలో కలిసిపోయేలా వేసవి లోతు దుక్కులు దున్నితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రోటావేటర్ యంత్రం సైతం వ్యర్థాలను తుంపులు చేసి భూమిలో కలిపివేస్తుంది. అలా చేయడం ద్వారా భూసారం పెరిగి పంటలకు మంచి పోషకాలు అందుతాయి. ప్రభుత్వం యాంత్రీకరణ సాగుకు ప్రోత్సహిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. రాయితీపై యంత్రాలను అందజేస్తూ విస్తృతంగా రైతులకు చేరువ చేయాలి. పంట వ్యర్థాల కాల్చివేత సమస్య తగ్గుతుంది. కూలీల లభ్యత కొరవడి రైతులు యంత్రాలతో పంట కోతలు సాగిస్తున్నారు. అవగాహన లేమితో రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో మిత్ర పురుగులు నశిస్తున్నాయి. పంటలపై తెగుళ్ల అధికమవుతున్నాయి.లోతు దుక్కులతో వ్యర్థాలు పూర్తిగా భూమిలో కలిసిపోయి చక్కటి సేంద్రియ ఎరువు తయారవుతుంది. వేసవి ఎండల తీవ్రత తోడు ఈదురుగాలుల తాకిడికి వాయు కాలుష్యం పెరిగి వాతావారణం సైతం కలుషితమవుతుందని నిపుణుల విశ్లేషణ. వాయు కాలుష్యం తెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్యపరిచినపుడే క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు సాధించవచ్చు. పశుపోషణ పెంపొందించేలా ప్రభుత్వం రాయితీ రుణాలు అందజేస్తే పశుగ్రాసం అవసరం ఏర్పడుతుంది.



**పంటలకు ముప్పే..**

ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న అవశేషాలకు నిప్పు పెట్టడంతో మంటలు చుట్టుప్రక్కల వ్యాపించి పెద్ద ఎత్తున పండ్ల తోటలు, జామాయిల్, సుబాబుల్, మొక్కజొన్న పంట , పశువులు కాలిపోయి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిన విషయం విధితమే.

**మిత్ర పురుగులు నశిస్తాయి.. ఎస్ మానస (చింతకాని మండల వ్యవసాయాధికారి)**

పంటలను తొలగించిన అనంతరం లోతు దుక్కులు దున్నుకుంటే మేలు చేకూరుతుంది. దుక్కిలో బయట పడిన మట్టి ఎండకు ఎండిన అనంతరం రోటావేటర్‌తో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. నిప్పుపెడితే పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తాయి. సూక్ష్మ ధాతువులు నశించి భూమి సారవంతం కోల్పోతుంది. పర్యావరణం దెబ్బతింటుంది.

## బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బాల్య వివాహాల నిర్మూలన, బాలికల ఆరోగ్య పరిరక్షణ, బాలల హక్కులపై చైతన్యం కల్పించే లక్ష్యంతో బూర్గంపాడు ప్రాజెక్ట్ ఎంపీ బంజారా సెక్టార్ ఆధ్వర్యంలో పినపాక పట్టినగర్ గ్రామ పంచాయితీలో ఏజీ గర్ల్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ బాలల పరిరక్షణ కమిటీ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం సీడీపీఓ రేవతి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. రక్తహీనత నివారణపై బాలికలు అవగాహన పెంచుకోవాలని, ప్రతి అమ్మాయి విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలదని సూచించారు. అదే విధంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ బి పద్మ మాట్లాడుతూ గ్రామస్తులు బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. బాలికల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో బాలల హక్కుల పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బి స్వరాజ్యం, ఐసిపిఎస్ సిబ్బంది కళ్యాణి, భావన, వైద్యుడు కృష్ణ ప్రసాద్, ఆశ కార్యకర్త కొండమ్మ, అంగన్వాడీ టీచర్, ఏజీ గర్ల్స్ తల్లులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి ఆళ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో పెద్దూరు గ్రామంలోని శ్రీ రెక్కల రామక్క ఆలయ ప్రాంగణంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆదివాసీల భూ సమస్యలు, ఫారెస్ట్ భూముల పరిరక్షణ, పోడు భూముల సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గ్రామీణ ప్రజల హక్కుల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీపీలు కొండ్రు మంజు భార్గవి, పడిగ సమ్మయ్య మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాటికి మహావీరుడు కొమరం భీమ్ విగ్రహ నిర్మాణం పూర్తి చేసి ఘనంగా ఆవిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందు కోసం గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కొమరం హనుమంతరావు, ఉపాధ్యాయులు జోగా రాంబాబు, సర్పంచులు పాయం రామ నర్సయ్య, మోకాళ్ళ చంద్రశేఖర్, పాయం బాబురావు, నాయకులు సుతారి కృష్ణ, తెల్లం జానీ, ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు పాయం రమేష్, గోగ్గల వినోద్, ఎదుళ్ల రమేష్, కొమరం వెంకట కృష్ణంరాజు, పడిగ సురేష్, సుతారి సురేష్, మద్దెల శ్రీను, కిషోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు అండగా సర్పంచ్ జాను



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండుతున్న ఎండల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు తుమ్రవారి గూడెం సర్పంచ్ కుంజ జాను తన సొంత ఖర్చులతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య సిబ్బందితో కలిసి కూలీలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు సూచించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూలీల ఆరోగ్య పరిరక్షణ గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. చల్లని మజ్జిగ, ఆరోగ్య పరీక్షలు నిర్వహించినందుకు కూలీలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్, కార్యదర్శి బానోతు ప్రతాప్, ఎంఎల్‌హెచ్‌పి ఎం షరాన్, ఏఎన్ఎం ఎస్ శాంతి, జి రమణ, కె లలిత, పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు అవమానం

-భగ్గుమన్న దళిత సంఘాలు
-ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ముందు నిరసన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహం రాత్రికి రాత్రి మండల అధికారులు తొలగించి, చెత్తలో వేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘాలు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ముందు నిరసన చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి దిశా నిర్దేశం చేశారని, 88శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు భారత పౌరులుగా సంపూర్ణ అవకాశాలు, హక్కులు కల్పించారని తెలిపారు. అంతటి మహానుభావుడి విగ్రహాన్ని తొలగించి అంబేద్కర్ ప్రభావాన్ని తగ్గించాలని చూడడం అవివేకమని అన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జీర్ణించుకోలేని కొందరు అధికార పార్టీతో కలిసి అధికారులను మధ్య పెట్టి ఈ ఘాతుగానికి పాల్పడటం దారుణమని అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తే పోటా పోటీగా మిగతా విగ్రహాలను కూడా ఏర్పాటు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మేము ఎవరికీ వ్యతిరేకం కాదని, అందరినీ గౌరవించే సంస్కృతి మాది అని, అంబేద్కర్‌ను అవమానిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# పోరాటాలతోనే గిరిజన హక్కులు సాధ్యం

-జల్, జంగిల్, జమీన్ కోసం యువత ముందుకు రావాలి
-సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా







ప్రజాపక్షం/బూర్గంపాడు: గిరిజనుల హక్కుల సాధించుకోవాలంటే పోరాటాలే మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. మండలంలోని ఉప్పుసాక గ్రామ పంచాయితీలోని రాజీవ్‌న గర్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ గిరిజన సంఘం మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్క రించి అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, త్రాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యా యని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో గిరిజన యువత హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. సీపీఐ చేపట్టనున్న జల్, జంగిల్, జమీన్ పోరాటాల్లో గిరిజన యువతి, యువకులు ముందుండాలని కోరారు. గిరిజన గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల గిరిజన సంఘం కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు ముమ్వ వెంక టేశ్వరరావు(లడ్డా), జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సబ్బం నాగేశ్వరరావు, పాల్వంచ మమండల కార్య దర్శి పూర్ణ, నాయకులు గుత్తుల సత్యనారాయణ, సుబ్బారెడ్డి, చారి, కుంజ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల వద్ద మంచినీటి సౌకర్యం లేకపాయే..!

-గ్లాసు తాగునీటి కోసం పరుగులు
-అధికారుల నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం



ప్రజాపక్షం/వైరా: ప్రభుత్వ కార్యాలయం నందు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రజల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన వైరాతో పాటు పలు మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పలు ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఆ కార్యాలయాలకు నిత్యం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు ప్రజాప్రతినిధులు వస్తూ పోతూ ఉంటారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రత 46 డిగ్రీలు దాటుతూ ఉంది. దాహం కోసం పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్లాసు నీరు తాగేందుకు ప్రభుత్వ కార్యాలయం నుండి మరల సెంటర్ల వరకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ప్రజలను బయటికి పోవద్దు, జాగ్రత్తలు పాటించాలి. అత్యవసర పరిస్థితులు ఉంటేనే బయ టకు రావాలి అని చెప్పే చెబుతూ ఉంది. అధికారులు ప్రభుత్వ కార్యాల యాల వద్ద ఎందుకు త్రాగునీటి కుండలను ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులు సైతం త్రాగునీటి కోసం అల్లాడు తున్నారు. ఇదేనా ప్రజల పట్ల ఉద్యోగుల పట్ల బాధ్యత, ఆయా ప్రభుత్వ కార్యాలయాల ముఖ్య ఉద్యోగి ఎందుకు కుండలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎండ తీవ్రత ఉక్కిరిబిక్కిరి గురిచేస్తుంది. వడగాల్పులు మనిషి శరీరంలో నీటి తేమను తగ్గిస్తూ ఉన్నాయి. డాక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు త్రాగాలని చెబుతున్నారు. ఇవన్నీ అధికా రులకు గుర్తు లేవా నిర్లక్ష్యం వహిస్తున్నారా త్రాగునీటి ఏర్పాటు చేయ డంలో ఎందుకు విఫలమయ్యారు.ఇప్పటికైనా పలు ప్రభుత్వ కార్యాల యాల నందు చల్లటి నీరును అందించే త్రాగునీటికోసం చలివేంద్రాలతో పాటు కుండలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతూ ఉన్నారు.

## లైన్‌మెన్‌కు పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: మాదారం ప్రాంతంలో విద్యుత్ షాక్ ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న లైన్మెన్ వెంక టేశ్వరరావుని కాంగ్రెస్ నేత నరేష్ కుమార్ ఖమ్మంలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పరామర్శించారు. మనోధైర్యం కల్పిస్తూ, హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాజే ష్‌ను కూడా పరామర్శించి, వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలంలోని గుంపెల్ల గూడెం గ్రామానికి చెందిన కునుసోత్ సీతారాము లు(45) బైక్ అదుపు తప్పి కిందపడటంతో మృతి చెందా డు. పనిమీద మంగళవారం ఇల్లందుకు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమా దంలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## మొక్కజొన్న రైతులపై
# అక్రమ కేసులు తొలగించాలి



ప్రజాపక్షం/చింతకాని : మేం కర్షకులం.. మా జీవ నాధారం వ్యవసాయం తాము రైతులమని అలాం టి మాపై చింతకాని ఎస్సై రైతులు కాదంటూ మాపై ప్రకటనలు చేయడం తీవ్రం గా బాధించిందని చింతకాని రైతులు పొనుగోటి రత్నాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చింతకాని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్ మాట్లాడుతూ ఈ నెల 22న చింతకాని సొసైటీకి తాళం వేసిన ఘటన నేపథ్యంలో తమపై చింతకాని ఎస్సై అక్ర మ కేసులు నమోదు చేసి రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. తాము శాంతి యుతంగా లారీలు తెప్పించి మొక్కజొన్నలు తరలించాలని రైతు లుగా తమ ఆవేదన వ్యక్తం చేశాము. ఇక్కడ అధికారులు అధికార పార్టీకి మాత్రమే పనిచేస్తున్నారని రైతుల పక్షాన తామొక రైతుగా ఆందోళన చేస్తే రైతులము కాదని ఎస్సై వీరేందర్ ఎలా పేర్కొన్నాడో తెలపాలన్నారు. తాము కాటాలు వేసిన బస్తాలు నేటికి కలాల్లోనే ఉన్నాయని అధికారులు వస్తే తాము చూపిస్తామన్నారు. రైతు ప్రభు త్వమని చెప్పుకునే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రైతులపై అక్రమ కేసులు పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో భాధిత రైతులు జల గనబోయిన కృష్ణ, ఆకుల చంద్రయ్య, బీఆర్ఎస్ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, యువజన విభాగం అ ధ్యక్షులు పిన్నెల్లి శ్రీను, షేక్ షబ్బీర్, గడ్డం శ్రీను, నన్నక గోవిందరావు పాల్గొన్నారు.

## గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/వైరా: పెరుగుతున్న నిత్యవసర ధర లకు అనుకూలంగా వేలాదిమంది కార్మికులు కనీస వేతనం అందక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్రామదీపికలకు కనీస వేతనం రూ.26 వేలు పెంచి ప్రభుత్వం వెంటనే వివోల కార్మికులను ఆదుకోవాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. వై రాలో గత ఐదు రోజులుగా గ్రామదీపికల రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం వారి సమస్య లు పరిష్కరించడంలో చిత్తవుద్ధి చూపించడం లేదు. తీవ్రమైన ఎండల్లో 46 డిగ్రీలు చూపిస్తున్న వారు టెంట్ల వద్ద నుండి లేవకుండా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నారని అన్నా రు. ఎన్నికల హామీల్లో ప్రభుత్వం సంఘటిత అసంఘిత వివోవ్ గ్రామపంచాయతీ వర్కర్లను రెగ్యులర్ చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు కన్నెత్తి వారి వైపు చూడకుండా ఉండటం సరైంది కాదని అన్నారు. గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మూల కొండా, ఏఐటియుసి మం డల కార్యదర్శి గారపాటి అశోక్, కొండా రామకృష్ణ పాల్గొని దీక్షలను సంఘీభావం తెలిపారు.

## వరి కొయ్యలను తగలబెట్టొద్దు



ప్రజాపక్షం/సత్తుపల్లి: పంట కోత అనంతరం వరి కోయిలను తగలబెట్టవద్దని మండల వ్యవ సాయ అధికారి వై. శ్రీనివాసరావు రైతులకు సూచించారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల భూమిలోని సేంద్రియ కర్బన శాతం తగ్గిపో వడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటా షియం వంటి పోషకాల సమతుల్యత దెబ్బతిం టుందని తెలిపారు. అలాగే, భూమిలో ఉండే మిత్ర పురుగులు నశించడంతో భూసారం తగ్గిపో వడమే కాకుండా నేల భౌతిక నిర్మాణం కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. పంట అవశేషాల దహనం వల్ల తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడి కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలవుతాయని చెప్పారు. ఈ వాయువుల ప్రభావంతో శ్వాసకోశ సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ కారక ప్రభావాలు కూడా కలగవచ్చని హెచ్చరించారు. కాబట్టి రైతులు వరి కొయ్యలను కాల్చకుండా, వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించి భూసారాన్ని, పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడా లని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆసుపత్రి కార్మికుల నూతన కమిటీ



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని ఆసుపత్రి కార్మికుల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సంద ర్భంగా గౌరవ అధ్యక్షులుగా తోట రామాంజనేయులు, అధ్య క్షులుగా యామాల రాజు (మధిర), ఉపాధ్యక్షులుగా ఇసప నూరి కుమారి (సత్తుపల్లి), టి యోబు (సత్తుపల్లి) కుమారి (తి రుమలాయపాలెం), ప్రధాన కార్యదర్శిగా వంశీ (కల్లూరు), సహాయ కార్యదర్శి ఆనందరావు (తిరుమలాయపాలెం), ఇరు కులపాటి పద్మ (సత్తుపల్లి), కార్యవర్గ సభ్యులుగా రమాదేవి, సత్యవతి కల్లూరు, తులసి సత్తుపల్లి , యశోద సుజాత రాజశేఖర్ మధిర, చైతన్య తిరుమలయపాలెం. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, వంశీ ,మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ , స్వీపర్స్, సూపర్వైజర్, సమస్యలు పరిష్కారం కోసం దశల వారి ఆందోళన లను కనీస వేతనం 26,000 ఇవ్వాలని జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని వారు పేర్కొన్నారు.

## గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై ప్రగతి శీల యువజన సంఘం(పివైఎల్)తెలంగాణ రాష్ట్ర నాయ కులు భూక్య శివ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన నిరు ద్యోగుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక డిఎస్సి నిర్వహించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం, గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏలు, కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పర్సిక రవి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకట నరసయ్య మృతి తీరని లోటు



ప్రజాపక్షం/కారేపల్లి: రేలకాయలపల్లి గ్రామ పంచాయితీలో సిబ్బంది విధు లుగా నిర్వహిస్తున్న పాయం వెంకట నర సయ్య అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. వారి మృతి గ్రామానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ గ్రామ సర్పంచ్ తేజావత్ శిరీష రమేష్, ఉప సర్పంచ్ జర్పుల కన్న, పంచాయితీ కార్యదర్శి డి రమేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో రూ 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా గ్రామ పంచాయితీ తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# సాగునీటి సమస్యపై దృష్టి సారించాలి



**- కూనంనేని కృషితో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**
**- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం**
**- కార్పొరేషన్ ప్రజలకు సేవచేయడమే ధ్యేయం**
**- మేయర్ మూడ్ గణేష్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్పోరేషన్ ప్రజలకు తాగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం కల్పించే దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని 12వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో మంగళవారం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన 3 నూతన బోర్లను మేయర్ మూడ్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌళికసదుపాయాలు తల్పించడం తమ బాధ్యతని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెం పట్టణాభివృద్ధికి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రధానంగా 12వ డివిజన్ భగత్‌సింగ్ నగర్ ప్రజలకు తాగునీటి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఏ సమస్య ఎదురైనా ముందుడి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి, 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నర్సింహా, 49వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్, 12వ డివిజన్ భగత్ సింగ్ నగర్ ప్రజలు, కొత్తగూడెం కార్పొరేటషన్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంగాపురంలో క్షుద్రపూజల కలకలం..!

**చేతబడి చేశారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అర్ధరాత్రి పసుపు, కుంకమ్మ, నిమ్మకాయలు, నాటు కోడి, ఎర్రటి అన్నం ముద్దలు, ఇంట్లో నుంచి తాంత్రిక పూజలు, తమ కు చేతబడి చేశారని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురం తండా లో తేజావత్ కళ్యాణిగిరి దంపతులకు గ్రామంలో ఓ మహిళ చేతబడి చేయించిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు మంత్రించిన నిమ్మకాయలు, పసుపు, కుంకమ, నల్లకోడి తో ఓ తాంత్రికుడు క్షుద్ర పూజలు చేశారు. గ్రామానికి చెందిన ఓ మహిళ కూసుమంచి మండలం లోని ఓ తాంత్రికుడు కు తమ ఫోటోలు, మా వివరాలు అందించి వారికి చేతబడి చేయాలని, తాంత్రికుడు కు రూ.20 వేలు ను అందించినట్లు సమాచారం. ఈ మేరకు ఇటీవల తాంత్రికుడు పూజలు వినిపిస్తుండటంతో భయమేస్తోందని, తాంత్రికుడు చేతబడి విషయం ను వారికి అనుకూలమైన, వారితో సన్నిహితంగా ఉన్న వ్యక్తి తమకు వివరాలు అందించారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. క్షుద్ర పూజల పై సమగ్ర విచారణ చేసి తమకు న్యాయం చేయాలని, తేజావత్ కళ్యాణి దంపతులు స్థానిక పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

# నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి కండక్టర్



**ప్రజాపక్షం/- భద్రాచలం** టిఎస్ ఆర్‌టిసి భద్రాచలం డిపోకు చెందిన కండక్టర్ రమేష్ తన నిజాయితీని చాటుకున్నారు. సోమవారం రాత్రి ఖమ్మం నుండి కొత్తగూడెం వరకు ప్రయాణించిన వనపర్తి కిరణ్ అనే ప్రయాణికుడు బస్సుల్లో తన ల్యాబ్‌టాప్ బ్యాగ్‌ను మర్చిపోయాడు. ఆ విషయాన్ని గుర్తించిన కండక్టర్ బస్సులోని ప్రయాణికులను ఆరా తీయగా తమది కాదని చెప్పారు. ఈలోగా ల్యాబ్‌ట్యాప్‌కు సంబంధించిన ప్రయాణికుడు తన వద్ద ఉన్న టిక్కెట్ ఆధారంగా డిపోకు ఫోన్ చేయడంతో కండక్టర్ రమేష్ ఫోన్ నెంబర్‌ను ఇచ్చారు. దీంతో ఆయన కండెక్టర్‌కు ఫోన్ చేసి తన ల్యాబ్‌ట్యాప్ బస్సులో మర్చిపోయానని, దానికి సంబంధించిన ఆధారాలతో పాటు తెలపాడు. నిర్ధారించుకున్న కండక్టర్ బస్సు పాల్వంచ వరకు వెళ్లిందని, త్వరగా వస్తే ల్యాబ్‌ట్యాప్ అందిస్తామని చెప్పడంతో ప్రయాణికుడు హుటాహుటిన పాల్వంచకు చేరుకోని కండెక్టర్ వద్ద ఉన్న తన బ్యాగ్‌ను రాత్రి 11 గం. సమయంలో అందుకుని కృతజ్ఞతలు తెలిపాడు. తన నిజాయితీని చాటుకున్న కండెక్టర్‌ని డిపో మేనేజర్‌తో పాటు పలువురు సిబ్బంది అభినందించారు.

# నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆకాల వర్షంకు దెబ్బతిన్నందుకు బాధితులకు నష్టపరిహారం అందించాలని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు కోరారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఆకాల వర్షంకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. మంగాపురంతండా లో రైస్ మిల్లు ను సందర్శించారు. నష్టం ను పరిశీలించారు. బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వలన అనేక మంది తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఒక్క రైస్ మిల్లులో దాదాపు రూ.10 లక్షల కు పైగా నష్టం వాటిల్లిందని అన్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే చేసి బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అదే విధంగా నాచేపల్లి, బైరవునిపల్లి, మంగాపురంతండా లో ఆకాల వర్షం కు నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరారు. స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుల వివరాలు నమోదు చేయించాలని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి బాధితులకు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.

# గ్రామదీపికల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామదీపికల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామదీపికలు నిరవదిక సమ్మె లో భాగంగా మంగళవారం దీక్ష శిభిరం ను సందర్శించారు. సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామ దీపికల సమస్యల ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఏ ఒక్క వర్గంకు న్యాయం చేయటం లేదన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించే వరకు వారు చేస్తున్న ఆందోళన లకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని వెంటనే వారి డిమాండ్ల ను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూరయ్య, మాదాసు ఆదాం, టీడీపీ నాయకులు గోగినేని వెంకట సీతారాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు పలువురు గ్రామదీపికలు పాల్గొన్నారు.

# తక్షణమే సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఐకేపి, విఓఏలు చేపట్టిన నిరసన ధీక్షలు మంగళవారం ఐదవ రోజుకు చేరుకొన్నాయి. ఈ సంధర్భంగా వివోఏ జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేసే గ్రామ దీపికలకు మాత్రం సరైన గుర్తింపు లేదని వాపోయారు. ప్రభుత్వం చాలీ చాలని వేతనాలను ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకొంటున్నదని ఆరోపించారు. మహిళా సంఘాల బలోపేతానికి నిత్యం కృషి చేస్తున్న వివోఏలకు ప్రభుత్వం స్పంధించి కనీస వేతనం 20 వేయిలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అనూరాధ, రమేష్, జ్యోతి, సుమలత, సుజాత, మీనా, కల్పన,మౌనిక, కుమారి, తార, అనూష, శైలజ, రమణ, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/పాల్వంచ :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాజీ దంతెలబోర ఎస్‌సి కాలని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్ అన్నారు. ఢిల్లోలోని ఇందిరా భవన్‌లో ఏఐసిసి జాతీయ అధ్యక్షులు, ఎస్‌సి డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, జాతీయ కో ఆర్డినేటర్, రాష్ట్ర ఎస్‌సి కార్పోరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి సెల్ చైర్మన్, మానకొండూరు ఎంఎల్ఏ కవ్వంపల్లి సత్యనారాయణల చేతుల మీదుగా జిల్లా అధ్యక్షులుగా నియామక పత్రాన్ని మంగళవారం గద్దల రమేష్ అందుకొన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక చేసిన నాయకులకు, పార్టీ అగ్ర నాయకత్వానికి దన్యవాదములు తెలిపారు.

# ఖాసీం మృతి సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ నాయకులు, సిటీ టైలర్స్ యాజమాని ఖాసీం మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. మంగళవారం ఖాసీం భౌతిక కాయాన్ని సంధర్శించి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాబీర్ పాష వెంట సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు లాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా 1980, 90 సంవత్సరాలలో టైలరింగ్‌లో నూతన ఒరవడి సృష్టిస్తూ మోడరన్ డ్రస్సులు కుట్టడంలో ఖాసీం పేరొందారు. తెలుగు, హిందీ సినిమాలలో కథానాయకులు ధరించిన దస్తులను కుట్టించుకోవడానికి కొత్తగూడెం, మణుగూరు పట్టణాల నుండి పెద్ద ఎత్తున యువకులు ఖాసీం దగ్గరకు వచ్చేవారిని పలువురు గుర్తు చేసుకొంటున్నారు.

# బాల్య వివాహాలు సమాజానికి శాపం



**ప్రజాపక్షం/మణుగూరు:** 99 రోజుల ప్రజాపాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుండి మే 30 వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా గుట్ట మల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో "బాల్య వివాహాలు బతుకు ఆగం" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ వాటిని అరికట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు హైమావతి, పద్మ, భద్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, యశోద, వెంకటరమణ పాల్గొని బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమరం మధుకిరణ్, గ్రామస్తులు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు.

# హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది




**ప్రజాపక్షం/భద్రాచలం :** గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నుండి విముక్తి పొందేందుకు 14 సం. నిండిన బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం ఎంతో మంచిదని సర్పంచ్ పూనెం కృష్ణదొర అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడీ సెక్టార్‌లో మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిడిపిఓ జ్యోతితో కలిసి ఆయన పాల్గొన్నారు. పూనెం మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీన తొలగిపోయేందుకు అంగన్వాడీలు మరింత కృషి చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువపోషకాల ఉండే ఆహారం తీసుకునేలా సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిడిపిఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయరాదని, అలా చేస్తే చట్టరిత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావని, ఇందుకోసం ఆయా గ్రామల యువత బాధ్యత తీసుకోవాలన్నా. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఓ శ్రఈనివాసరావు, సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, కాపుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఒక ఘటన.. రెండు వినతులు..!



-హత్యకేసులో ఎందుకీ తాత్సారం
-కాంగ్రెస్ వారే హంతకులు : సిపిఎం
-హంతకులను తేల్చండి
-సిపికి కాంగ్రెస్ వినతి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన సిపిఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్య ఏడు మాసాల తర్వాత కూడా చర్చనీయాంశంగా మారింది. రామారావు హత్యకు సంబంధించి నిందితులు ఎవరన్నది ఇంత వరకు పోలీసులు తేల్చలేదు. విచారణ సరైన కోణంలోనే జరుపుతున్నామన్న పోలీసులు దోషులను మాత్రం తేల్చలేక పోయారు. కానీ సోమ, మంగళవారం జరిగిన రెండు ఘటనలు మరల ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీశాయి. సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో సిపిఎం నాయకులు రామారావు సతీమణి స్వరాజ్యం ముఖ్యమంత్రిని కలిసి కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు తన భర్త రామారావును హత్య చేశారని వారిని అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఇది ఇలా ఉండగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపీ సిపిని కలిసి రామారావు హంతకులను అరెస్టు చేయాలని వినతి పత్రం సమర్పించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే హత్య చేశారని సిపిఎం నాయకులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే మంగళవారం కాంగ్రెస్ నాయకులు హంతకులు ఎవరో తేల్చాలని ఖమ్మం సిపి సునీల్ దత్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వడం గమనార్హం. సామినేని రామారావు హత్య గతేడాది అక్టోబర్ 31న జరిగింది. ఇది సుఫారీ హత్యగా భావించారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిద్ర లేచిన రామారావును కత్తితో పొడిచి చంపారు. సంఘటన స్థలంలో దొరికిన ఆధారాల ప్రకారం పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక రాజకీయ నాయకున్ని హత్య చేసేందుకు సుఫారీ ఇవ్వడం సంచలనానికి కారణమైంది. సిపిఎం మాత్రం గ్రామ కాంగ్రెస్ నాయకుడు బొర్రా ప్రసాద్ నేతృత్వంలో హత్య చేశారని ఆరోపించినప్పుడు పోలీసులు బెంగళూరు తీసుకెళ్లి లై డిటెక్టర్ పరీక్షలను కూడా నిర్వహించారు. రామారావు హత్య కేసు విషయంలో వినతి పత్రం సమర్పించిన అనంతరం నూతి సత్యనారాయణ మాట్లాడుతూ మధిర నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మల్లు భట్టివిక్రమార్క శాంతి కాముకుడని ఏనాడు హింసా రాజకీయాలను ప్రోత్సహించ లేదన్నారు. అనవసర ఆరోపణలు చేస్తూ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఎం నాయకుడు రామారావును హత్య చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# బిజెపి తీరుతో భారంగా మారిన జీవనం



**ధరలను నియంత్రించండి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి తీరుతో ప్రజల జీవనం భారంగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోడీ అనుసరిస్తున్న విధానాలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారాయని ఆయన తెలిపారు. ధరల పెరుగుదలకు సంబంధించి మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇదే సమయంలో పెట్రో ధరలను విపరీతంగా పెంచుతుందని ఆయన తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటికి నేటికి పెట్రోల్ ధరల్లో ఎంత పెరుగుదల కనిపించిందో ప్రజలు గమనించి ఈ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేవలం 15 రోజుల వ్యవధిలోనే మూడుసార్లు పెట్రో ధరలను పెంచారని దీనితో ప్రజలపై అదనపు భారం పడుతుందని పెట్రోల్ వినియోగదారులకే కాకుండా డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయన్నారు. పదేళ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు రెండు రేట్లు పెరిగాయని సురేష్ తెలిపారు. మోడీ పాలన కేవలం సంపన్నుల కోసమే సాగుతుందని ఇప్పుడు కూడా ఆయిల్ కంపెనీల లాభాల కోసమే ప్రజలపై భారాలు మోపారన్నారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ధరల పెరుగుదలపై పోరాట కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.

# నిబంధనలు పాటించని శబరి బార్ అండ్ రెస్టారెంట్..!




-వైన్ షాపులని తలపిస్తున్న అమ్మకాలు
-క్వాటర్, బీరుకు రూ.20లు అధికం
-అలా అమ్మడానికి అనుమతులు లేవు :
ఎక్సైజ్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎక్సైజ్ అధికారుల తీరు రోజురోజుకు విమర్శలకు తావిస్తుంది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ సమీపంలో ఉన్న శబరి బార్ అండ్ రెస్టారెంట్‌పై ఎక్సైజ్ అధికారులకు అమితమైన ప్రేమ కనిపిస్తుంది. నిబంధనలకు విరుద్దంగా శబరి బార్ అండ్ రెస్టారెంట్ కొనసాగుతూ ఉంది. శబరి బార్ అండ్ రెస్టారెంట్‌లో వైన్ షాపులు మాదిరిగా మద్యం విక్రయాలు జరుగుతూ ఉన్నాయి. శబరి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం అమ్మకాలకు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ మౌనం పాటిస్తూ ఉంది. కనీసం అటువైపు కనుచూపు వరకు కూడా కనిపించడం లేదు. గత మూడు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ బృందం వచ్చిందని శబరి రెస్టారెంట్ బయటకు మద్యం సాయంత్రం పూట అమ్మకుండా నిలిపివేశారు. అక్కడికి వెళ్లి మందు అడిగితే మేము బయటికి అమ్మడం లేదు. ఇక్కడే లోపల తీసుకోవాలని చెప్పడం జరగింది. అంటే టాస్క్‌ఫోర్స్ అధికారులు వస్తున్నారని భయపడుతున్న నిర్వాహకులు ఎక్సైజ్ అధికారుల గురించి భయపడటం లేదు అంటే ఆంతర్యం ఏమిటి ఒక్కసారి ఆలోచించాలి. ఈ బార్ అండ్ రెస్టారెంట్‌లలో ఒక క్వార్టర్‌కి రూ.20లు అదనం, బీర్‌కు రూ.20లు అదనంగా దోచుకుంటున్నారు. అయినా కూడా ఎక్సైజ్ అధికారుల్లో మార్పు కనిపించడం లేదు.

### మద్యం విక్రయాలు అలా అమ్మడానికి అనుమతి లేదుః ఎక్సైజ్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి

శబరి బార్ అండ్ రెస్టారెంట్ నందు వైన్‌షాప్ మాదిరిగా మద్యం అమ్మడానికి ఎలాంటి అనుమతులు లేవని ఎక్సైజ్ కమీషనర్ తెలిపారు. శబరి రెస్టారెంట్ నిబంధనలకు విరుద్దంగా జరుగుతున్న అమ్మకాలపై ప్రజాపక్షం ఎక్సైజ్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డిని వివరణ అడగగా బార్ అండ్ రెస్టారెంట్‌లో వైన్‌షాప్ మాదిరిగా బయటకు క్వార్టర్లు అమ్మకాలకు అనుమతి లేదని అధికంగా వసూలు చేయడం ప్రభుత్వ నిబందనల ప్రకారం తప్పు అని ఆయన అన్నారు. ఇదే విషయమై అలా నిర్వహించేన బార్ అండ్ రెస్టారెంట్‌పై చర్చలు తీసుకుంటామని ఎక్సైజ్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

## కూసుమంచి మండలంలో
# ఎన్యూమరేటర్లపై ఒత్తిళ్లు..!

-దళిత, గిరిజన ప్రాంతాలలో లేని సౌకర్యాలు ఉన్నట్లుగా నమోదు చేయాలంటూ పైఅధికారుల ఒత్తిడి..?

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలో నిర్వహిస్తున్న సెస్సెస్ తరహా సర్వేల్లో ఎన్యూమరేటర్లపై తీవ్ర ఒత్తిళ్లు పెరుగుతున్నాయని విశ్వాసనీయ సమాచారం. ముఖ్యంగా దళిత, గిరిజన వాడల్లో వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా వివరాలు నమోదు చేయాలని కొందరు అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఎన్యూమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని జనం చెబుతున్నారు. గ్రామాల్లో బోరు నీళ్లపై ఆధారపడుతున్న కుటుంబాల వద్ద మిషన్ భగీరథ నీరు అందుతోందిగా నమోదు చేయాలని, ఇంటింటికి సెల్ ఫోను ఉంటే ఇంటింటికి ఇంటర్నెట్ కూడా ఉన్నట్లుగా నమోదు చేయాలని, ఒకే గది ఉన్న ఇళ్లను రెండు గదుల ఇల్లుగా చూపించాలని, కూలిపోయిన ఇండ్లను తక్కువగా చూపించాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అంతేకాక మరుగుదొడ్లు లేక బహిరంగ మలవిసర్జనకు వెళ్లే కుటుంబాల వద్ద కూడా టాయిలెట్ సదుపాయం ఉందని నమోదు చేయాలని సూచిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నమోదు చేసిన వివరాల్లో పొరపాట్లు ఉన్నాయని పేర్కొంటూ రాత్రి 12గంటల వరకు సవరణలు చేయించాలని, మరుసటి రోజు మళ్లీ సర్వే నిర్వహించాలని సవరణ చేయకుండా సర్వే నిర్వహించవద్దు అంటూ అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతోందని జనంలో వినికిడి. దీంతో సర్వే సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధి గణాంకాలు, కేంద్ర, రాష్ట్ర నిధుల కేటాయింపుల్లో ఈ సర్వేలకు కీలక ప్రాధాన్యత ఉండటంతో తప్పుడు వివరాలు నమోదు అయితే భవిష్యత్తులో అసలు సమస్యలు మరుగునపడే ప్రమాదం ఉందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళిత, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత ఇంకా కొనసాగుతుండగానే కాగితాలపై మాత్రమే అభివృద్ధి చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులపై విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా కొందరు మాత్రం తమకు కారు, ట్రాక్టర్ ఉన్న లేనట్టుగా బంగ్లాలు ఉన్నా లేనట్లుగా, తమ పేదరికంలో ఉన్నట్లుగా సర్వేలో తెలుపుకోవడం కొస మెరుపు.

**కూసుమంచి తహసీల్దార్ జి సైదులు వివరణ....**

సెస్సెస్ సర్వేలో పాల్గొన్న సిబ్బందిపై ఎటువంటి ఒత్తిడి లేవని వారంతా టీచర్లు కావడం వారు ఉన్నది ఎన్నట్లుగానే చేయగలుగుతారని, ఎవరిపై ఒత్తిడి లేవని చెప్పారు. మేము కూడా ఉన్నది ఉన్నట్లుగానే నిర్వహించాలని కోరుతున్నట్లు తెలిపారు.

## విధి నిర్వహణలో
# గుండెపోటుతో కండక్టర్ శంకర్ మృతి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విధి నిర్వహణలో ప్రయాణికులకు టిక్కెట్లు జారీ చేస్తూ గుండెపోటుకు గురై బీరెల్లి శంకర్ (50) అనే కండక్టర్ గుండెపోటుకు గురై ఒక్కసారిగా బస్సులో కుప్పకూలి మృతి చెందిన విశాదకర సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పరకాల ఆర్‌టిసి డిపోకు చెందిన టిఎస్ ఆర్‌టిసి బస్సు భద్రాచలం నుండి హన్మకొండకు బయలు దేరింది. ఈ క్రమంలో ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో కొందరు ప్రయాణికులు బస్సు ఎక్కడంతో కండక్టర్ టిక్కెట్లు జారీచేసే పనిలో నిమగ్నమయ్యాడు. బస్సు అనిశెట్టిపల్లి వంతెన వరకు చేరుకోగా అక్క సారిగా గుండెపోటుకు వచ్చి కుప్పకూలిపోవడంతో అప్రమత్తమైన ప్రయాణికులు సిపిఆర్ చేయడం మొదలు పెట్టి 108కు ఫోన్ చేసి హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికై మృతి చెందినట్లు నిర్ధారించారు. సిపిఆర్ చేసినప్పటికీ ప్రాణం దక్కక పోవడటంతో వైద్యులతో పాటు ప్రయాణికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని శంకర్ మృతదేహాన్ని చూసి రోదిస్తున్న తీరు పలువురుని కంటతడి పెట్టించింది.

## గోదావరి పుష్కరాలకు
# రూ. వెయ్యి కోట్లు కేటాయింపు పట్ల హర్షం



**ప్రజాపక్షం/భద్రాచలం :** వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులను కేటాయించడం పట్ల భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షులు పరిమి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరఘాట్‌లు ఇతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం అభినందనీయమని, ఇందులో భాగంగా తొలివిడత రూ.300 కోట్లు విడుదలకు అమోదం తెలపడం గర్వకారణం అన్నారు. పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# యువతి అదృశ్యం

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే నిషాన్(19)అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఈనెల 22న రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రపోయారు. అనంతరం రాత్రి 11గంటల సమయంలో యువతి తల్లి ఎస్‌కే నిషాద్ బి లేచి చూడగా కూతరు ఇంట్లో కనిపించలేదు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా యువతి ఆ చూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ములకలపల్లి ఎస్ఐ మధు ప్రసాద్ తెలిపారు.